

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


3 లో **జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి**




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 249 పేజీలు - 08 వెల - 05/- శుక్రవారం 04-09-2026


## కర్నూలులో జగన్ పర్యటన

- జనక్--శ్రియ దంపతులకు జగన్ ఆశీస్సులు
- ఎస్పీ కుమారుడి రిసెప్షన్‌కు జగన్ హాజరు
- నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన జగన్
- జగన్ రాకతో సందడిగా మారిన వేడుక

2



## మద్రాస్ హైకోర్టులో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ

● కొలత్తూర్ నియోజకవర్గంలో ఓటమిపాలైన స్టాలిన్ ● ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయంటూ పిటిషన్ ● పిటిషన్ విచారణార్హం కాదన్న ధర్మాసనం

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన సొంత నియోజకవర్గమైన కొలత్తూర్‌లో ఎదురైన ఓటమిని



2



## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

● తోతాపురి మామిడికి రూ.281 కోట్ల నిధులు ● పొగాకు రైతులకు రూ.94 కోట్ల సాయం ● వరద పునరుద్ధరణ పనులకు రూ.6.24 కోట్లు ● అమరావతి సంగమానికి రూ.759.79 కోట్ల ఆమోదం ● మెట్రో, రైల్వే, రహదారులపై కీలక నిర్ణయాలు ● ఏపీ ట్రాన్స్‌కోకు రూ.950 కోట్ల ప్రభుత్వ హామీ

మిగతా 2లో

## పాతబస్తీ అభివృద్ధికి రూ.25 కోట్లు

డిసెంబరులో గౌలిగూడ--చాంద్రాయణగుట్ట మెట్రో పనులు



● చంచల్‌గూడ--సంతోష్‌నగర్ ఫ్లైఓవర్ ప్రారంభం ● డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.25 కోట్లు ● రూ.500 కోట్లతో మీరాలం ట్యాంక్ అభివృద్ధి ● విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

హైదరాబాద్: చారిత్రక హైదరాబాద్ పాతబస్తీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు రాజకీయాలకు అతీతంగా శాయశక్తులా కృషి చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దేశంలోనే అభివృద్ధి చెందిన అతిపెద్ద నగరంగా హైదరాబాద్‌ను మిగతాది 2లో

## జైశంకర్‌తో భేటీ..
## భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు!

● జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ ● యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ ● భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ ● బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ ● శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు.



2

## ఒక్కరోజే రూ. 4000 జంప్..

- ఆరు రోజుల నష్టాల తర్వాత భారీగా పెరిగిన బంగారం ధర
- మళ్లీ రూ. 1.60 లక్షల మార్కును దాటిన పసిడి
- అమెరికా జాబ్ డేటా ప్రభావంతో బలహీనపడిన డాలర్
- వెండి ధర సైతం కిలోకు రూ. 5000 మేర జంప్



మిగతాది 2లో

## లోక్ భవన్‌కు సీఎం

### రేవంత్.. కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం

కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం

- లోక్‌భవన్‌కు సీఎం రేవంత్ రెడ్డి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ
- బర్తరఫ్ ఉత్తర్వులపై గవర్నర్ సంతకం
- కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి లోక్‌భవన్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ కూడా వెళ్లారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సీఎం, మంత్రులు భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజాగా నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ముఖ్యంగా కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించే అంశంపై గవర్నర్‌తో సీఎం చర్చించినట్లు సమాచారం. ఆమె బర్తరఫ్‌కు మిగతాది 2లో





2

## నల్సార్ విద్యార్థులకు భారీ ఊరట..

● న్యాయ విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు ● నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐని ఆహ్వానించడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులు ● నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థులను ఎన్‌రోల్ చేయవద్దని బీసీఐ చైర్మన్ ఆదేశం

## భారత్‌కు ఆకాశ నిఘా బలం

జీఎస్ఎల్‌వీ-ఎఫ్17తో ఉపగ్రహ ప్రయోగం

- సెప్టెంబర్ 4న ఈఓఎస్-05 ప్రయోగం
- తెల్లవారుజామున 2.55 గంటలకు లాంచ్
- దాదాపు 36 వేల కి.మీ. ఎత్తులో నిఘా
- సరిహద్దులు, తీరాలపై నిఘాకు ఉపయోగం

దాదాపు ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. వరుసగా రెండు పీఎస్ఎల్‌వీ ప్రయోగాలు విఫలమైన నేపథ్యంలో.. ఈసారి జీఎస్ఎల్‌వీ-ఎఫ్17తో ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపట్టనుంది. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మిషన్‌లో ఈఓఎస్-05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను అంతరిక్షంలో మిగతాది 2లో



# జనసేన నాయకుడు మల్లికి లోకేష్ అభినందన




Certificate of Appreciation

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లె గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు నల్లబోతుల మల్లికార్జున కు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలుపుతూ ప్రశంస పత్రం పంపారు. గత ఆరు సంవత్సరాలుగా ఆర్ఎస్ గాజులపల్లెలోని ఎంపీపీఎస్ పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు స్టేషనరీ పుస్తకాలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన సేవలను గుర్తించి మంత్రి అభినందిస్తూ ప్రశంస పత్రం పంపడం జరిగిందని జనసేన నాయకుడు మల్లి తెలిపారు. ఈ సంధర్భంగా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. తన సేవలను రాష్ట్ర మంత్రి గుర్తించి ప్రోత్సహించడం నా బాధ్యతలను మరింత పెంచే విధంగా ఉన్నాయి అని పేర్కొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

మహానంది, పల్లె వెలుగు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కో కన్వీనర్ కాకర్ల శివ తెలిపారు. గురువారం మహానందిలో



ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 9 మంది జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి భద్రత కోసం సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి సంఘాన్ని బలోపేతం చేయాలని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకుని సంఘ కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈనెల 20న నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరిగే ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రథమ మహాసభలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కృష్ణమూర్తి బాబు, వెంకట శివయ్య, భూమా మహేష్, ఎస్ డి. ఎం రఫి,చల్లా శ్రీనివాసులు, చంద్రమోహన్, రాము, సోమశేఖర్,తదితరులు పాల్గొన్నారు.ద

# హేమాద్రిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఘన ఏర్పాట్లు!

**చిన్నారుల ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ.. భక్తులకు ఆధ్యాత్మిక సందడి**



కీసర: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 4వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ శ్రీ కందాడి హనుమంత్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు తెలిపారు. చిన్నారుల ఉట్టి కొట్టే వేడుకే హైలైట్! శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులతో నిర్వహించనున్న ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. చిన్నారుల ఉత్సాహం, భక్తుల సందడి మధ్య ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా జరిగే ఈ మహోత్సవానికి భక్తులు, ప్రజలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. అదేవిధంగా ఈ దివ్య కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు పాత్రికేయులు, మీడియా మిత్రులు హాజరై కార్యక్రమాన్ని కవర్ చేయాలని దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఆహ్వానం పలికారు. వేదిక: హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం
తేదీ: 04 సెప్టెంబర్ 2026, శుక్రవారం సమయం: సాయంత్రం 4 గంటల నుంచి భక్తి పారవశ్యంలో హేమాద్రి.. చిన్నారుల సందడితో మార్మోగనున్న దేవస్థానం!

# మృత ఏఎస్ఐ కుటుంబానికి రూ.20.80 లక్షల బీమా చెక్కు

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్



ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. సురేష్ రెడ్డి 05.07.2026 తేదీన జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసు శాఖలో సేవలందించిన సురేష్ రెడ్డి కుటుంబానికి పోలీసు శాఖ తరఫున గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.20,80,000/- విలువైన చెక్కు చీఫ్ ఆఫీస్ నుండి అందింది. సదరు చెక్కును నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ నేడు సురేష్ రెడ్డి భార్యకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ఎల్లప్పుడూ తన సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటుందని,పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి శాఖ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఖాదర్ భాషా , పరిపాలన విభాగం అధికారులు వీరన్న , కవిత మరియు నంద్యాల జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు స్వామినాయక్ పాల్గొన్నారు.

# నంద్యాలలో ఇంటర్ జోనల్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం.

- ప్రారంభించిన డాక్టర్ మధుసూదనరావు.
- బాక్సింగ్ శిక్షణ శిబిరాలు,రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు నంద్యాలలో నిర్వహిస్తాం: నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మధుమణి ఆసుపత్రి ఆడిటోరియంలో ఇంటర్ జోనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి ఫయాజ్ నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి అమరావతి క్రీడా పోటీలలో బాక్సింగ్ లో జిల్లా క్రీడాకారులు ఒక బంగారు పతకం, నాలుగు రజత పతకాలు సాధించి , విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల తర్వాత తృతీయ స్థానంలో నిలవడం నంద్యాలకు గర్వకారణం అన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల ఆధ్వర్యంలో రాష్ట్రంలో క్రీడలకు




విశేష ప్రోత్సాహం అందిస్తున్నందుకు క్రీడా సంఘాల తరపున డాక్టర్ రవి కృష్ణ ధన్యవాదాలు తెలిపారు. నంద్యాలలో బాక్సింగ్ శిక్షణ శిబిరాలు, రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు .

డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడాకారులు మహమ్మద్ అలీ, మేరీ కోమ్ లాంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని నిరంతర సాధన ద్వారా ఉన్నత స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ ఆడిటోరియం క్రీడలకు కూడా వినియోగిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

నంద్యాల జిల్లా బాక్సింగ్ కార్యదర్శి ఫయాజ్ మాట్లాడుతూ ఈ పోటీలలో కర్నూలు,నంద్యాల, అన్నమయ్య మూడు జిల్లాల నుండి 150 మంది పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని, బాలురకు, బాలికలకు వేరువేరుగా వివిధ వెయిట్ కేటగిరీలలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్ తో పాటు, నంద్యాల పట్టణ కార్యదర్శి నూర్ భాషా, కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, అహోబిలం జడ్పీ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, అన్నమయ్య జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఆనంద్ , బాక్సింగ్ కోచ్ లు, రెఫరీలు ఉపేంద్ర, గణేష్, చంద్ర, జస్వంత్, పోటీలలో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పేరుతో రాయలసీమకు నీళ్లు నిరాకరిస్తారా?

- క్యారీ ఓవర్ నీటి గోల్మాల్.. ఎందుకీ నిర్లక్ష్యం?
- (39.26 టీఎంసీలకే జలాశయాన్ని ఎందుకు పరిమితం చేశారు?)
- రాయలసీమ నీటి హక్కుపై ఎమ్మెల్యేల మౌనం..ఎందుకీ నిస్సహాయత?
- నీళ్లు దానం కాదు... రాయలసీమకు అది జన్మహక్కు!
- శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేసిందెవరు? అధికార పక్ష ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలి.
- రాయలసీమ ప్రజా ప్రతినిధులకు బొజ్జా దశరథరామిరెడ్డి సూటి ప్రశ్నలు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రకృతి ప్రతి సంవత్సరం ఒకే విధంగా స్పందించదనీ.. కృష్ణా జలాలు సమృద్ధిగా వచ్చిన సంవత్సరాలలో శ్రీశైలం జలాశయంలో క్యారీ ఓవర్ నీటిని నిల్వ చేసుకోవాలని ట్రిబ్యునల్ నిర్దేశించినా, గత సంవత్సరంలో 2259 టిఎంసి ల కృష్ణా జలాలు వచ్చినా మే 31, 2026 నాటికి జలాశయాన్ని 817.80 అడుగులకు, 39.26 టీఎంసీలకు ఎందుకు తీసుకువచ్చారో అధికార పక్ష ఎమ్మెల్యేలు రాయలసీమ ప్రజలకు సమాధానం చెప్పాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు.

గురువారం నంద్యాల సమితి ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..

గత 12 ఏళ్లుగా శ్రీశైలం జలాశయ విధివిధానాలను అమలు చేయాలని రాయలసీమ ప్రజలు డిమాండ్ చేస్తున్నారని, అవి అమలై ఉంటే మే 31 నాటికి సుమారు 872 అడుగుల వద్ద 150 టీఎంసీల నీరు నిల్వ ఉండేదని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి అధికార పక్ష ఎమ్మెల్యేలకు ఐదు సూటి ప్రశ్నలను సంధించారు.

1.క్యారీ ఓవర్ నీరు ఎందుకు నిల్వ చేయలేదు?

ఎల్‌నినో లాంటి తక్కువ కృష్ణా ప్రవాహాల పరిస్థితులు ముందే తెలిసినప్పటికీ, కృష్ణా జలాలు సమృద్ధిగా వచ్చిన సంవత్సరాల్లో శ్రీశైలం జలాశయంలో క్యారీ ఓవర్ నీటిని నిల్వ చేయకుండా 39.26 టీఎంసీలకు ఎందుకు తీసుకువచ్చారు?

2.శ్రీశైలం నీటిని విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఎందుకు తరలించారు?

శ్రీశైలం ఎడమగట్టు ద్వారా 56.83 టీఎంసీలు, కుడిగట్టు ద్వారా 12.23 టీఎంసీలు - మొత్తం 67.96 టీఎంసీలు విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్ కు తరలిస్తూ, జలాశయం ఖాళీ చేస్తుంటే ఎందుకు ప్రభుత్వ చర్యలను పశ్నించలేదు?

3.రాయలసీమ ప్రాజెక్టులకు నీరు ఎందుకు ఇవ్వలేదు?

శ్రీశైలానికి కర్ణాటక, మహారాష్ట్రల వర్షాల ద్వారా సుమారు 211 టీఎంసీల నీరు చేరినా, కేసి కెనాల్, ఎస్సార్ బీసీ, తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా ఆయకట్టు చెరువులు, కుంటలకు నీరు అందించడంలో ఎందుకు జాప్యం చేశారు.

4.కృష్ణా డెల్టా కోసం శ్రీశైలం నీటి తరలింపును ఎందుకు అడ్డుకోలేదు?

పట్టిసీమ, పులిచింతల అందుబాటులో ఉన్నప్పటికీ కృష్ణా డెల్టా లో వరి పంట కోసం శ్రీశైలం జలాశయం నుంచి 15 టీఎంసీల నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇండెంట్ పెట్టడాన్ని ఎందుకు అడ్డుకోలేదు? తాగునీటి అవసరాలు ఉన్నాయని చెబుతూ రాయలసీమ నీటిపై మాత్రం ఎందుకు ఆంక్షలు?

5.రాయలసీమకు నీటి హక్కుపై ఎమ్మెల్యేలు ఎందుకు మౌనం వహిస్తున్నారు?

ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్‌కు చేరే నీటిని ఆంధ్రప్రదేశ్ కూడా వినియోగిస్తుందని జలవనరుల శాఖ మంత్రి ప్రకటించిన నేపథ్యంలో, శ్రీశైలం జలాశయం అడుగంటితే రాయలసీమకు సాగునీరు, తాగునీరు అందడం కష్టమవుతుందని ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయలేదు.

**రాయలసీమకు నీరు దానం కాదు.. హక్కు**

ఒకవైపు రాయలసీమకు ఆరుతడి పంటలకు నీరు అందిస్తామని ప్రచారం చేస్తూ, మరోవైపు తాగునీటికి కూడా ఇబ్బందులు కలిగే పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ప్రభుత్వం స్పష్టం చేయాలీ అని బొజ్జా డిమాండ్ చేసారు.

ఎల్‌నినోను సాకుగా చూపకుండా శ్రీశైలం జలాశయ విధివిధానాలను అమలు చేస్తూ, త్రాగునీరు, సాగునీటికి ప్రాధాన్యతను ఇచ్చి రాయలసీమ ప్రాజెక్టుల ఆయకట్టుకు, చెరువులు, కుంటలకు తక్షణమే అందించాలని బొజ్జా కోరారు. అధికార పక్ష ఎమ్మెల్యేలు ఈ ఐదు ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో పాటు, రాయలసీమ సాగునీటి సమస్యలను ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని బొజ్జా దశరథ రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నంద్యాలలో సెప్టెంబర్ ఆరో తేదీ ఉచిత కృత్రిమ కాలు అందజేత కార్యక్రమం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల ఆయుష్ యోగ కేంద్రంలో ఈ నెల ఆరవ తేదీ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నంద్యాలలో ప్రత్యేకంగా 50వేల రూపాయలు విలువ చేసే ఉచిత కృత్రిమ కాలు అందజేత కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆనంద్ గురూజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు లేదా ఇతర కారణాలతో కాళ్లు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వారికి ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా కృత్రిమ కాళ్లు అందజేస్తున్నట్లు తెలిపారు.




షేర్ సొసైటీ సహకారం మరియు పబ్బు బాలచంద్రుడు కుమారుడు డాక్టర్ పబ్బు చిరంజీవి చేయూతతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.

అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ?50,000 రూపాయల విలువైన కృత్రిమ కాలు ఉచితంగా అందజేయబడుతుందని తెలిపారు. అలాగే, 30 మందికి పరిమితంగా ఈ సేవ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

కార్యక్రమ వివరాలు
తేదీ: 06-09-2026, ఆదివారం
సమయం: ఉదయం 9.00 గంటల నుంచి
కార్యక్రమ స్థలం: ఆయుష్ యోగా కేంద్రం, మున్సిపల్ పార్క్ లోపల టౌన్ హాల్ ప్రక్కన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అర్హత ఉన్న వారు ముందుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. చిన్నారులు, కుటుంబ సభ్యులు మరియు నడవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు
ఖండే ఆనంద్ గురూజీ: 9989983673
కె.ఎస్.ఆర్. ఆంజనేయులు
సేవ -- గౌరవం -- చలనం -- కొత్త జీవితం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# బండి పరిమళ జ్యోతి కి రాష్ట్ర ఉత్తమ గురు బ్రహ్మ పురస్కారం




కాశినాయన, సెప్టెంబర్ 3 ( పల్లె వెలుగు ) వైయస్సార్ కడప జిల్లా కాశినాయన మండలం లోని రెడ్డి కొట్టాల జెడ్పీ హైస్కూల్ లో బండి పరిమళ జ్యోతి ని రాష్ట్ర ఉత్తమ గురు బ్రహ్మ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ 17 సంవత్సరాలుగా తను విద్యార్థుల కోసం చేస్తున్న వినూత్న బోధనా పద్ధతులను, టి ఎల్ ఎం,ఎలక్ట్రానిక్ వీడియో డివైస్, ట్యాబ్స్, డిజిటల్ విద్యా కార్యక్రమాలు సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి మొదటి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ బిఎస్ నారాయణరెడ్డి గారు పరిమళ జ్యోతిని మండల విద్యాశాఖ అధికారిని ఓ నిర్మల, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్, పి ఎస్ హెచ్ఎం ఖదీర్ భాష, ఉపాధ్యాయుల సమక్షంలో రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారం తో ఘనంగా సత్కరించారు. కాశి నాయన మండలం ఎం ఈ ఓ నిర్మల మాట్లాడుతూ కాశి నాయన మండలంలో పరిమళ లాంటి ఉపాధ్యాయుని ఉండడం మండలానికి, మాకు చాలా గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బిఎస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ బావి పౌరులుగా, సమాజానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దే శిల్పి టీచర్. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పరిమళ జ్యోతిని రాష్ట్ర ఉత్తమ గురు బ్రహ్మ పురస్కార్ తో ఘనంగా సత్కరించడం హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని వహీదా ఉపాధ్యాయుల గొప్పతనం గూర్చి పాట పాడి వినిపించండి రషీదా భరతనాట్యంతో అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మహేష్ కుమార్, సురేష్ , వెంకటసుబ్బయ్య, సావిత్రి ,విజయలక్ష్మి, శ్రీలత, భాష, దేవరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

**- 100% ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి**
**- ఈ-ఆటోల డ్రైవర్లకు కమిషనర్ చల్లా ఓబులేసు సూచనలు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎలక్ట్రిక్ ఆటోలకు రథసారథులుగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు డ్రైవర్లకు సూచించారు. గురువారం విశాల్ మార్ట్ సమీపంలోని ఈ-ఆటోల ఛార్జింగ్ స్టేషన్ వద్ద ఈ-ఆటోల పార్కింగ్, గార్బేజ్ ట్రాన్స్ఫర్ పాయింట్, ఛార్జింగ్ పాయింట్లు పనితీరును పరిశీలించి, డ్రైవర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కొత్తగా విధుల్లో చేరిన డ్రైవర్లు కార్పొరేషన్ కుటుంబంలో సభ్యులని, విధుల్లో బాధ్యత, నిబద్ధత ఎంతో అవసరమని అన్నారు. విధుల్లో భాగంగా తమకు అప్పగించిన ప్రాంతాల్లో 100% ఇంటింటి చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. చెత్త సేకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆటోల నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఏజెన్సీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ-ఆటోలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, చెత్త సేకరణ ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, శానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇన్స్పెక్టర్ మునిస్వామి, వెహికల్ ఇన్చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# కేసి,కుందూకు 1000 క్యూ సెక్కుల నీరు విడుదల





బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 3: తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కర్నూల్ కడప కాలువతోపాటు, కుందూ నదికి 1000 క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు. బానక చెర్ల రెగ్యులేటర్ ద్వార బుధవారం 1000 క్యూసెక్కుల నీరు వదిలితే, రాత్రికి బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్దకు నీరు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి నుండి 1000కి చెక్కుల నీటిని అటుకుందుకు ఇటు కేసి కాలువకు వదలడం జరిగింది. కర్నూలు కడప కాలువలో ప్రస్తుతం ఆరు అడుగుల లోతులో నీరు ప్రవహిస్తూ ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రజల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలువకు నీరు వదలడం జరుగుతుందని రెండు రోజుల క్రితం ఆత్మకూరు ఆర్డీవో వెంకట శివ ప్రకటించడం జరిగింది. ఈ మేరకు కేసి కుందూ నదులకు నీరు వదలడం జరిగింది. కర్నూలు కడప కాలువకు నీరు వదలడం ద్వారా, కాలువలో వెంట ఉన్న బోర్లు రీఛార్జి అయ్యే అవకాశం ఉంది. సాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని అధికారులు నీళ్లు వదిలినప్పటికీ, 40 రోజులుగా ఎండిపోతున్న వరి పొలాలకు రైతులు నీళ్లు పారించుకునే అవకాశం కూడా ఏర్పడింది. కర్నూల్ కడప కాల్వలో, కుందూ నదిలో నీటి గలగలల సవ్వడులతో రైతులు ఆనంద పడిపోతున్నారు. కుందూ నది పరివాహక ప్రాంతం వెంట చాలామంది రైతులు వరిని సాగు చేయడం జరిగింది. అటు తాగే నీటికి, ఇటు రైతు పొలాలకు నీరు సమృద్ధిగా లభించే అవకాశం ఏర్పడింది. పది రోజుల క్రితమే బానకచర్ల ద్వారా సంత జూటూరు పిక్ అప్ ఆనకట్ట మీదుగా 500 క్యూసెక్కుల నీటిని అధికారులు కుందు నదికి వదలడం జరిగింది. ఐదు రోజుల క్రితమే తర్వాత నీటిని నిలిపివేయడం జరిగింది. ప్రజల తాగునీటి అవసరాలతో పాటు, త్వరలో వినాయక ఉత్సవాలు జరిగే పరిస్థితి ఉంది కాబట్టి, నిమజ్జన కార్యక్రమాలకు కూడా నీటి కొరత ఉందన్న ముందుచూపుతో అధికారులు కుందూ నదికి కూడా నీరు వదలడం జరిగింది.

# ఎస్సీ ఎస్టీ, బిసి ,ఓటర్ల గుర్తింపు అభ్యంతరలపై గ్రామసభలు



దొర్నిపాడు సెప్టెంబర్ 3 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిమిత్తం రాజ, గా, దీజ ఓటర్ల గుర్తింపు ఓటర్లుగాగుర్తించబడిప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా అభ్యంతరములపైఈనెల3/09/2026 నుండి 06/09/2026 వరకు గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల మూడో తేదీన ఉదయం 10 గంటలకు అమ్మిరెడ్డి నగర్ , అర్జునాపురం కొండాపురం,గోవిందిన్నే గ్రామాలకుఅధికారులుగ ఎంపీడీవో సావిత్రి, డిప్యూటీ ఎంపీడీవోలు చంద్రమౌళి శివప్రసాద్ ,తాసిల్దార్ సుభద్రల పర్యవేక్షణలో గ్రామపంచాయతీ భవనాల యందు గ్రామసభలు ఉన్నట్లు ఆమె తెలిపారు,అదే విధంగదొర్నిపాడు,బుర్రరెడ్డిపల్లె,గుండుపాపల,కొత్తపల్లి, రామచంద్రాపురం, చాకరాజు వేముల,కిష్టిపాడు గ్రామాలలో ఈనెల5 ఉదయం 10 గంటలకు గ్రామసభలుఉంటాయన్నారు,కలెక్టర్ మరియుజిల్లామేజిస్ట్రేట్ వారిచేనియమించబడ్డ మండల స్థాయి ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించబడు గ్రామ సభలలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ఓటర్లు హాజరై ఓటర్ల జాబితా నందువివరములుపరిశీలించుకుని, తమ వివరాలలో ఏవైనా మార్పులు ఉన్నచో తగిన ఆధారాలతో పంచాయతీ అభివృద్ధి అధికారిని సంప్రదించి సరైన వివరములు నమోదు చేయించుకోవలసినదిగా కోరడమైనది అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు

# ఆత్మనిర్భరతతో మేలైన దిగుబడులు..







బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 3 :నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్య పోషక యాజమాన్యాన్ని రైతులు పాటించాలని బండి ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని భోజనం పరమటూరు గ్రామాలలో రైతులకు నూనె గింజల జాతీయ మిషన్-ఆత్మనిర్భారత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. సమతుల్య పోషక యాజమాన్యం ద్వారా పంటలకు కావాలసిన అన్ని రకాల పోషకాలను సరైన నిష్పత్తి సరైన సమయం, సరైన పద్ధతిలో జరుగుతుందన్నారు. దీని వల్ల నేల సారం దెబ్బతినకుండా స్థిరమైన, అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. అదేవిధంగా జాతీయ ఆహార భద్రత ఆత్మనిర్భారత మరియు సోయా చిక్కుడు నూనె గింజల జాతీయ మిషన్లో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు.

**సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంట విత్తనాల పంపిణీ**

80 శాతం సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ పవన్ కుమార్ తెలిపారు.తక్కువ నీటిని వినియోగించే మినుము, కొర్ర వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు 80 శాతం సబ్సిడీపై అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ తెలిపారు. మండలానికి మినుము,కొర్ర విత్తనాలు కలిపి 75 క్వింటాళ్ల కేటాయింపు జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం పంట వేయని రైతులు ఆధార్, పొలం పాసు పుస్తకం వివరాలను ఆర్ఎస్కే సిబ్బందికి అందజేసి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మినుము 4 కిలోల ప్యాకెట్ రూ.104, కొర్ర 4 కిలోల ప్యాకెట్ రూ.24కు సబ్సిడీపై అందుబాటులో ఉన్నట్లు తెలి పారు. సాగు చేసిన పంటలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలన్నారు. పంట బీమా, ఎరువులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఇన్పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు పొందేందుకు ఈ-పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ, స్వర్ణ గ్రామ సెక్రెటరీ ప్రసన్న పలువురు రైతులు పాల్గొన్నారు.

# విలువలను మింగేస్తున్న అశ్లీల ప్రవాహం

*-తల చెడినా తత్వం చెడకూడదన్నది పెద్దల మాట.*



పల్లె వెలుగు:మనసులో మంచితనం, ఆలోచనల్లో వివేకం, మాటల్లో సంస్కారం ఉంటేనే వ్యక్తి, సమాజం అభివృద్ధి చెందుతాయి.అయితే నేటి సాంకేతిక యుగంలో అశ్లీల కంటెంట్ విస్తరణ ఆందోళన కలిగిస్తోంది.స్మార్ట్ఫోన్, సోషల్ మీడియా, ఓటీటీలు, వివిధ వెబ్సైట్ల ద్వారా అసభ్యకర దృశ్యాలు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయి.ముఖ్యంగా చిన్నారులు, యువతపై వీటి ప్రభావం తీవ్రంగా ఉండటం ఆందోళనకరం.అశ్లీల కంటెంట్కు అలవాటు పడటం వల్ల ఆలోచనా విధానంలో మార్పులు, దూకుడు స్వభావం, వికృత ప్రవర్తన పెరిగే ప్రమాదం ఉంది.కొంతమంది వాటిని అనుకరిస్తూ మహిళలు, చిన్నారులపై వేధింపులకు, లైంగిక నేరాలకు పాల్పడుతున్న ఘటనలు సమాజాన్ని కలచివేస్తున్నాయి.సోషల్ మీడియా అల్గారిథమ్లు కూడా ఒకసారి ఆసక్తి చూపిన కంటెంట్ను పదేపదే చూపిస్తూ యువతను ఆకర్షిస్తున్నాయి.దీంతో తెలియకుండానే ఎంతోమంది అశ్లీలత అనే ప్రమాదకర వలలో చిక్కుకుంటున్నారు.ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు; కుటుంబ వ్యవస్థ, సామాజిక విలువలకు కూడా ముప్పుగా మారుతోంది.అందువల్ల అశ్లీల వెబ్సైట్లు, యాప్లపై ప్రభుత్వం సమర్థవంతమైన నియంత్రణను కొనసాగించాలి.హరిప్రసాద్ దూపాటి సామాజిక విశ్లేషకుడు । సమాచార హక్కు ఉద్యమ నేత । సీనియర్ ఫ్యాకల్టీ । అనుదీప్ ఫౌండేషన్ -- నైపుణ్య ఒ వృత్తి అభివృద్ధి కేంద్రం × షాపూర్ నగర్, హైదరాబాద్.

# శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పల్లె వెలుగు దినపత్రిక గడివేముల లోని శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ శ్రీ వీ. రామేశ్వరరావు మాట్లాడుతూ శ్రీ కృష్ణ జన్మాష్టమి అనేది శ్రీకృష్ణుడు జన్మించిన రోజును పురస్కరించుకుని జరుపుకునే పవిత్రమైన పండుగ. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో కృష్ణ పక్ష అష్టమి తిథి, రోహిణి నక్షత్రం రోజున ఈ పండుగ వస్తుంది. ద్వాపర యుగంలో మథురను కంసుడు అనే రాక్షస రాజు పరిపాలించేవాడు. తన చెల్లెలు దేవకీకి పుట్టబోయే ఎనిమిదవ సంతానం తనను చంపుతుందని ఆకాశవాణి చెప్పడంతో కంసుడు దేవకీ వసుదేవులను చెరసాలలో బంధించాడు. వారికి పుట్టిన ఏడుగురు బిడ్డలను కంసుడు చంపేశాడు. ఎనిమిదవ బిడ్డగా శ్రీకృష్ణుడు జన్మించగానే చెరసాల తలుపులు తెరుచుకున్నాయి, కాపలాదారులు గాఢ నిద్రలోకి జారుకున్నారు. వసుదేవుడు ఆ బిడ్డను బుట్టలో పెట్టుకుని యమునా నదిని దాటి గోకులంలోని నందుడు యశోదల ఇంటికి చేర్చాడు. అక్కడే కృష్ణుడు బాల్యాన్ని గడిపాడు. చిన్నతనంలో వెన్న దొంగతనాలు చేస్తూ అల్లరి పిల్లాడిగా అందరినీ అలరించాడు. పెద్దయ్యాక కంసుడిని సంహరించి ధర్మాన్ని నిలబెట్టాడు. కురుక్షేత్ర యుద్ధ సమయంలో అర్జునుడికి భగవద్గీతను బోధించి జగద్గురువు అయ్యాడు. భగవద్గీతలో నీ పని నువ్వు చెయ్యి ఫలితాన్ని ఆశించకు అని చెప్పాడు. ధర్మం నశించినప్పుడు అధర్మం పెరిగినప్పుడు తాను అవతరిస్తానని చెప్పాడు. జన్మాష్టమి రోజున ప్రజలు ఉపవాసం ఉంటారు, కృష్ణుడి విగ్రహానికి పాలు వెన్న పండ్లతో అభిషేకం చేస్తారు, భజనలు చేస్తారు. ఎత్తులో కట్టిన ఉట్టిలో పెరుగు వెన్న వేసి పిల్లలు మానవ పిరమిడ్ గా పేర్చుకుని దానిని పగలగొట్టే ఉట్టి కొట్టడం సంప్రదాయం చాలా ప్రసిద్ధి. ఈ పండుగ మనకు ప్రేమ, ఆనందం, ధర్మం, కష్టపడే తత్వాన్ని నేర్పుతుంది. చాలామంది విద్యార్థిని విద్యార్థులు గోపిక మరియు శ్రీకృష్ణుని వేషధారణలో పాఠశాలకు వచ్చారు. పాఠశాలలో పండుగ వాతావరణం మొదలైనది. ఈ కార్యక్రమంలో పాఠశాల శ్రీ. రాఘవేంద్రరావు మరియుఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# గ్రామసభలు ప్రారంభం





బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 3: రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు గాను ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తూ ఉంది. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎస్సీ బీసీ ఎస్టీలను గుర్తించేందుకుగాను గ్రామాలలో గ్రామసభలను నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. గురువారం బండి ఆత్మకూరు మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రత్యేక అధికారులు గ్రామసభలను నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ జాబితాలకు సంబంధించి, ఓటర్లను గుర్తించేందుకు విలువ గ్రామసభలు నిర్వహించారు. రిజర్వేషన్ల జాబితాను గ్రామసభలలో చదివి వినిపించారు. ఇందుకు ఏదైనా అభ్యంతరాలు ఉంటే, పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు. బండి ఆత్మకూరు గ్రామసభలో తహసిల్దార్ పద్మావతమ్మ కార్యదర్శి రాజశేఖర్ గ్రామ సభను నిర్వహించారు. నారాయణపురం చిన్నదేవళా పురం గ్రామాలలో ప్రత్యేక అధికారి శ్యామలమ్మ గ్రామ సభలను నిర్వహించి జాబితాను వివరించారు. గ్రామసభలలో ఆయా పార్టీకి చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులంతా తమకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం వీలు కల్పించిందని అధికారులు గ్రామ సభలో ప్రజలకు వివరించారు.

## నంద్యాల జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు

**సాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి నిమ్మల సానుకూల హామీ**



బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 3:రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నంద్యాల జిల్లాలో రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్,రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర రెడ్డి ,కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి గౌరు చరితా రెడ్డి , గిత్త జయసూర్య ,రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు ను కలిసి, వర్షాలు సకాలంలో లేకపోవడంతో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి అవసరమైన నీటిని విడుదల చేయాలని కోరారు. రైతులు మరియు జిల్లా ప్రజల త్రాగు నీరు సమస్యపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, రైతులకు సాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## గుండెపోటుతో రైతు మృతి

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన బండారు



శేఖర్ (45 )అనే రైతు గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గురువారం పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఒక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారన్నారు. ఐదున్నర ఎకరం పొలాన్ని కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశామని తెలిపారు. నీళ్లు లేక వరి పొలం ఎండిపోతుందని బాధపడుతూ గత రెండు రోజుల నుంచి నలతగా ఉందని కుటుంబ సభ్యులకు తెలియజేశారని వారు తెలిపారు. పొలం ఎండిపోతే పోయింది, అప్పులు ఉంటే తర్వాత అయినా తీర్చుకుందామని కుటుంబ సభ్యులు ఓదార్చినట్లు తెలిపారు. పంట ఎండుతోందని మనోవేదనతో గుండెపోటు సంభవించిందని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఓ కూతురు, ఒక కొడుకు సంతానం. రైతు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన రోకియా బేగం

నంద్యాల ప్రతినిధి సెప్టెంబర్ 3 పల్లె వెలుగు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు రోకియా



బేగం గురువారం నంద్యాలలోని వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని సిబ్బందితో మాట్లాడి, అక్కడ నిర్వహిస్తున్న కేసులు, బాధిత మహిళలకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. సెంటర్‌లో సిబ్బంది అందరూ విధులకు హాజరై చురుకుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం సెంటర్‌లోని బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వారికి పలు సూచనలు చేశారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్ పరిసరాలను పరిశీలించి, సెంటర్‌లోని వసతులు, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బాధిత మహిళలకు సురక్షితమైన వాతావరణంతో పాటు అవసరమైన సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి దేవి, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ఉమా మహేశ్వరమ్మ, వన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ శిరీష, ఓ ఎస్ సి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేస్తాం.

- పెండింగ్ దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి.
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపరిమితిలో పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ ఐ ఆర్ సవరించిన షెడ్యూల్, విచారణలు పూర్తయి తుది నిర్ణయం కోసం పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఫారం-6, 7, 8ల స్వీకరణ-పరిష్కారం, బి ఎల్ ఓ స్టేటస్‌కు సంబంధించిన కాల్‌బుక్, ఎన్ జి ఎస్ పి ఫిర్యాదుల పరిష్కార స్థితిగతులపై సమీక్షించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇప్పటికే వివరించడంతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రెస్‌నోట్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ కార్యక్రమం 85 శాతం పూర్తయిందని, మిగిలిన 15 శాతం ప్రక్రియను ఈ వారంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఫారం-6, 7, 8లకు సంబంధించి సుమారు 14,000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన ఫారం-6 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, ఎటువంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ సీఈఓ కు వివరించారు. అదేవిధంగా బి ఎల్ ఓ స్టేటస్‌కు సంబంధించిన కాల్‌బుక్‌లో 12 అంశాలు, ఎన్ జి ఎస్ పి లో 2 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం తీసుకునేందుకు రెవెన్యూ సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

**ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేలా ప్రజలను ప్రోత్సహించాలి.**

- యువతలో రక్తదానంపై విస్తృత అవగాహన కల్పించాలి.
- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేసి, ప్రజలకు అవసరమైన సమయంలో రక్తం అందుబాటులో ఉండేలా రక్తదాన కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకునేందుకు రెవెన్యూ శాఖ సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆమె ఆకాంక్షించారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన రెడ్‌క్రాస్ బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిని గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్ తో పాటు వివిధ సెక్షన్లకు చెందిన రెవెన్యూ సిబ్బంది కలిసి అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న మానవతా సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీలో లైఫ్‌టైమ్ మెంబర్‌షిప్ తీసుకుని సంస్థ సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని... యువత, మహిళల్లో రక్తదానంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రక్త నిల్వలు నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ శాఖ సిబ్బంది కూడా స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాల్లో పాల్గొనడంతో పాటు, తమ పరిధిలో ప్రజలను రక్తదానానికి ప్రోత్సహించాలని సూచించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరాలను రెవెన్యూ శాఖ సిబ్బంది భాగస్వామ్యంతో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలను సమన్వయం చేసుకుని రక్తదాన శిబిరాలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా అత్యవసర సమయాల్లో రక్తం కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడవచ్చన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాల్లో ఉద్యోగులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## అన్నదాతపై అక్రమ కేసులా? భేషరతుగా ఎత్తివేయాలి-- నంది రైతు సమాఖ్య .



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. సాగునీరు, తాగునీరు ఇవ్వాలని అడిగితే... నీరు విడుదల చేయాల్సిన ప్రభుత్వమే, అన్నం పెట్టే రైతులపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు న్యాయం? ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కలవడానికి వెళ్లిన రైతులపై, వారికి మద్దతుగా నిలిచిన మాజీ ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయడాన్ని 'నంది రైతు సమాఖ్య' అత్యంత తీవ్రంగా, కన్నీటి పర్యంతమై ఖండిస్తోంది! "రైతులు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించలేదు, వినాశనం కోరలేదు. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి, పశువుల దాహార్తి తీర్చడానికి నీళ్లివ్వమని వేడుకోవడమే మేము చేసిన నేరమా?" అని నంది రైతు సమాఖ్య నాయకులు గళమెత్తారు. వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే గేట్లు వేసి అడ్డుకోవడం, శాంతియుతంగా రోడ్డుపై కూర్చుంటే... ఏకంగా 35 మందిపై కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఏమీ నిషేధిత ప్రాంతం కాదు, రైతులేమీ నేరస్థులు కారన్నారు. స్థానిక నంది రైతు సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షులు రామ సుబ్బారెడ్డి, జనరల్ సెక్రెటరీ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి మధుసూదన్ రెడ్డి, వైఎస్ఆర్‌సిపి ఎస్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శంకర్ నాయక్ మాజీ సర్పంచ్ కోటిరెడ్డి ఎర్రన్న మీడియా సమావేశం నిర్వహించారు.

నంది రైతు సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ...శ్రీశైలంలో నీళ్లున్నా... రైతుల గుండెల్లో మంటలా?లిలి రాయలసీమ ప్రాంత ప్రాజెక్టు అయిన శ్రీశైలంలో ఏకంగా 175 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నప్పటికీ, దిగువకు నీటిని విడుదల చేయకుండా రోజులు గడుపుతుంటే రైతాంగం ఎలా తట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు లేక, సాగునీరు అందక రైతులు, ప్రజలు, పశువులు అల్లాడిపోతున్నారు.

సెప్టెంబర్ 15 నుండి ప్రారంభమయ్యే రబీ సీజన్ లో 100 రోజుల పంటలు సాగు చేసుకోవడానికి వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. నాడు కమతాల్లో చెమటోడ్చి దేశానికే అన్నం పెట్టిన రైతు... నేడు హక్కుల కోసం, ప్రాణాధారమైన నీటి కోసం రోడ్డెక్కితే వేధింపులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం? రైతులపై, వారికి అండగా నిలిచిన ప్రజాప్రతినిధులపై బనాయించిన అక్రమ కేసులను జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వం వెంటనే, బేషరతుగా ఉపసంహరించుకోవాలని కోరారు. కక్షసాధింపు చర్యలు మాని, తక్షణమే దిగువకు సాగు, తాగునీటిని విడుదల చేసి రైతాంగాన్ని, రాయలసీమను కరువు కోరల నుండి కాపాడాలని నంది రైతు సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు

# ప్రతి మహిళా ఫోన్లో దిశ యాప్ ఉండాలి  దీనిపై అవగాహన కార్యక్రమం.



గడివేముల పల్లె వెలుగు దినపత్రిక  నంద్యాల జిల్లా  గడివేముల మండలం గడిగేరేవుల హైస్కూల్ నందు  నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు ప్రసాదు అయిన మేము రాజశ్రీ ఎస్పీ సార్  ఆదేశాల మేరకు రాజశ్రీ ఏ ఎస్ సుస్మిత  మేడమ్ ఉత్తర్వుల మేరకు విద్యార్థినులకు  విద్యార్థులకు  హెడ్మాస్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన శక్తి యాప్ గురించి శక్తి యాప్ నంబర్ 7993485111 ను తెలిపి ఎక్కడైనను సైబర్ నేరంలు అనగా తమ తల్లిదండ్రుల మొబైల్ కు ఫేక్ మెసేజ్లు యాప్స్ మరియు ఎవరైనా ఓటీపీ నెంబర్ అడిగిన చెప్పరాదని ప్రస్తుతం పెళ్లి పత్రిక అను యాప్ వచ్చిన ఓపెన్ చేయరాదని తెలిపి అట్లు ఏదైనా సైబర్ నేరములు జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్  1930  కి  ఫోన్  చేయవలెనని అంతేకాకుండా  చిన్నపిల్లల  పైన  నేరములు బాల్యవివాహములు జరిగిన టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేయవలెనని చెప్పినాము శక్తి యాప్ వలన కలిగే ఉపయోగం లను వివరించడం అయినది వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను శక్తి టీమ్ల పనితీరును తెలిపి  ఆపద సమయంలో అమ్మాయిలు శక్తి యాప్ నంబర్ కు వీడియో కాల్ గాని నార్మల్ కాల్ గాని చేసినచో పోలీసులు తక్షణమే స్పందిస్తారని చెప్పి ఎక్కడైనను నేరములు



జరిగిన ఈవ్ టీజింగ్ మరియు ర్యాగింగ్ జరిగిన వెంటనే ఎమర్జెన్సీ కాల్ 112 100 కు ఫోన్ చేయవలెనని తెలిపినాము అమ్మాయిల మహిళల రక్షణ మరియు భద్రత పోలీసుల ముఖ్య ఉద్దేశ్యము అని చెప్పి ప్రతి అమ్మాయి మరియు మహిళల మొబైల్ నందు శక్తి యాప్ ఉండవలెనని చెప్పినాము విద్యార్థులు చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండి బాగుగా  చదువుకోన వలయునని తెలిపి నాము విద్యార్థిని విద్యార్థులు మైనర్ డ్రైవింగ్ చేయరాదని అట్లు చేయుట నేరమని తెలిపి నాము అమ్మాయిలు ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రుల మొబైల్  మరియు అక్క పిన్ని మొదలగు వారి మొబైల్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేయవలెనని శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానము తెలిపి అవేర్నెస్ ప్రోగ్రాం గురించి వివరించడం జరిగింది.

# నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేకున్నా ప్రిన్సిపాల్ గా వ్యవహరించిన ఫాదర్ సునీల్ కుమార్ పై చర్యలు తీసుకోవాలి

**- ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్.**





పోరుమామిళ్ల,సెప్టెంబర్ 3(పల్లె వెలుగు ): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి విద్యా అర్హత లేకున్నా పోరుమామిళ్ళ లోని హోలీ రోసరి స్కూల్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించిన ఫాదర్ సునీల్ కుమార్ పై విచారణ జరిపి క్రిమినల్ కేసు నమోదు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్యంలో కడప జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ....

పోరుమామిళ్ళ మండల కేంద్రంలో ఆర్.సి.యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోలీ రోసరి స్కూల్ లో ఎలాంటి విద్యార్హతలు లేకున్నా ఫాదర్ సునీల్ కుమార్ గారు ప్రిన్సిపాల్ గా వ్యవహరించడం చట్ట విరుద్ధమన్నారు. విద్యార్థుల టీ.సీ లు మరియు ఐ.డి కార్డులలో సైతం ప్రినిపాల్ హోదాలో సంతకం పెట్టడం దారుణమన్నారు. దీనినిబట్టి చూస్తే పాఠశాల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు అన్నారు. రెండురోజుల క్రితం ఫాదర్ సునీల్ కుమార్ గారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తాను ప్రిన్సిపాల్ ని కాదని కేవలం పాఠశాల కరస్పాండెంట్ ని అని చెప్పడం జరిగిందని మరి అలాంటప్పుడు విద్యార్థుల టి.సి లపై ప్రిన్సిపాల్ గా ఎలా సంతకం పెడతారని వారు ప్రశ్నించారు. గురువుగా అందరికి ఆదర్శంగా ఉండాల్సినవారే ఇలా అప్పద్దాలు చెప్పడం ఏంటని వారు ప్రశ్నించారు. ఎలాంటి విద్యార్హత లేకున్నా విద్యాశాఖ అధికారులను మరియు రాష్ట్ర ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ప్రిన్సిపాల్ గా వ్యవహరించిన ఫాదర్ సునీల్ కుమార్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి నాయకులు జీవన్, కుమార్, చైతన్య లు పాల్గొన్నారు.

# ఈ నెల 5, 6 తేదీల్లో 'స్పెషల్ క్యాంపెయిన్ డే'

**● 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి ● క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు ఈ నెల 10 వరకు ● కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**






పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఈ నెల 5, 6వ తేదీల్లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 'స్పెషల్ క్యాంపెయిన్ డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు అసెంబ్లీ ఓటరు నమోదు అధికారి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల వివరాల్లో మార్పులు, సవరణలు, అనర్హుల పేర్ల తొలగింపు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6, ఓటరు జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాల కోసం ఫారం-7, ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణలు లేదా నివాస మార్పు కోసం ఫారం-8ను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్ధారించుకునేలా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలని, అవసరమైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఈఆర్వో చల్లా ఓబులేసు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

# మూడు ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ. .

**ఐసిడిఎస్ సూపర్వైజర్ రసీదా బేగం.**

రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలో 3 ఆయా పోస్టులకు సిడిపిఓ ఆదేశాల మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ రసీదా బేగం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని వెలగలపల్లెలో ఎస్సీ గ్రూప్ 2, ముత్తలూరులో 2 బీసీఏ, దాసర పల్లెలో ఎస్సీ గ్రూప్ 3 గా ఆయా పోస్టులకు ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు 05 -09 -2026 తేదీ ఉదయం 10:30 సమయం కార్యాలయం లో దరఖాస్తులు అందజేయాలని ఆమె తెలిపారు.

# మినీ గోకులాలతో రైతులకు ఆర్థిక భరోసా



మహానంది, పల్లె వెలుగు ప్రభుత్వం మినీ గోకులాలతో రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, మహానంది దేవస్థానం చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి లు పేర్కొన్నారు. గురువారం మహానంది మండలంలోని యు. బొల్లవరం, సీతారామపురం గ్రామాల్లో  పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా మినీ గోకులాల షెడ్ల నిర్మాణానికి భూమి పూజ  నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శివయ్య, నాయకులు పాల్గొన్నారు

# నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలి - సీపీఎం




బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి సెప్టెంబర్ 3 :--నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు వై. ఎల్లయ్య, వి. సుబ్బారాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బేతంచెర్ల పాత బస్టాండ్ భారత్ బేకరీ సర్కిల్ వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి బి. రామాంజనేయులు అధ్యక్షతన రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు నిత్యావసర ధరలను నియంత్రిస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం బియ్యం క్వింటాల్ రూ. 3200, చక్కెర కిలో రూ. 75, కందిపప్పు కిలో రూ. 130 నుండి 150, బెల్లం కిలో రూ. 80 నుండి 100 వరకు పెరిగిందని, పప్పు, ఉప్పు, నూనె వంటి వంట సామాగ్రి కూడా సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుభకార్యాలు చేసుకోవాలంటే మధ్యతరగతి కుటుంబాలు అప్పులపాలు కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, మధ్యతరగతి ప్రజలను కలుపుకొని భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డోన్ శివరాం, రామకృష్ణ, రామళ్లకోట మద్దయ్య, జై శ్రీనివాసులు, పెద్దయ్య, కే. కొట్టాల రామాంజనేయులు, టింగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ అనుసంధానంతో ఫార్మసీలో విప్లవాత్మక మార్పులు..





పాణ్యం సెప్టెంబర్ 3 పల్లె వెలుగు : ఏఐ కృత్రిమ మేధస్సు అనుసంధానంతో ఫార్మసీ రంగంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమని అసోసియేషన్ ఆఫ్ ఫార్మ సూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఏపీ టిఐ కార్యదర్శి డాక్టర్ నరేంద్ర దేవన బోయిన పేర్కొన్నారు. గురువారం శాంతి కళాశాలలో ఏపీ టిఐ సహకారంతో రెండు రోజుల జాతీయస్థాయి ఫార్మా నెక్స్ట్ సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ఔషధ శాస్త్రంతో అనుసంధానం చేయడం ద్వారా ఔషధ పరిశోధన అభివృద్ధి విశ్లేషణ చికిత్స విధానాల్లో మరింత వేగవంతమైన మార్పులు తీసుకురావచ్చు అని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఐఎస్బిఎన్ సెమినార్ ప్రొసీడింగ్ సిడిలను ఆవిష్కరించారు. విద్యార్థులు, పరిశోధకులు వివిధ భాగా విభాగాలకు చెందిన ఫార్మా సూటికల్స్, కెమిస్ట్రీ, అనాలసిస్, ఫార్మా కా లజి, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్, పోస్టర్లు, శాస్త్రీయ పరిశోధన ప్రదర్శనలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటిఐ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటరమణ, సహాయ కార్యదర్శి డాక్టర్ బలగాని పవన్ కుమార్, కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతి రాముడు, ఎండి శివరాం, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ శెట్టి, కో కన్వీనర్ డాక్టర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## తెరుచుకోని వెలుగు కార్యాలయం

# - పొదుపు మహిళల అవస్థలు.

పల్లె వెలుగు బండి ఆత్మకూరు.నంద్యాల జిల్లా,  బండి ఆత్మకూరు మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయంలో సమయపాలన లోపించింది.



గురువారం ఉదయం 11:40 గంటలైనా కార్యాలయం తెరుచుకోలేదు. కార్యాలయానికి వచ్చిన పొదుపు మహిళలు చాలాసేపు ఎదురుచూసి వెనుదిరిగి వెళ్లిపోయారు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ఏపీఎం గుర్రప్పను వివరణ కోరగా.. నంద్యాల పీడీ కార్యాలయంలో మీటింగ్ ఉండడంతో వెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, కార్యాలయానికి తాళం వేయకుండా కనీసం ఒకరు అందుబాటులో ఉండేలా, మరియు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

## ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్

-నిబంధనలు ఉల్లంఘించిన వీఆర్ఓ సస్పెన్షన్: జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, పోరంబోకు భూముల విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ హెచ్చరించారు. ప్యాపిలి మండలం మాధవరం గ్రామంలో గతంలో వీఆర్ఓగా పనిచేసిన మల్లారెడ్డి, సర్వే నంబర్ 507లోని గ్రామకంఠం (ప్రభుత్వ పోరంబోకు) భూమిని సరైన ఆధారాలు, సహాయక పత్రాలు లేకుండా ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసినట్లు అందిన ఫిర్యాదుపై జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టారు.

విచారణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ కావడంతో ప్రస్తుతం డోన్-1 క్లస్టర్ వీఆర్ఓగా పనిచేస్తున్న మల్లారెడ్డిని బుధవారం సస్పెండ్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వైఎస్ జగన్

కర్నూలులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ కుమారుడి రిసెప్షన్‌కు హాజరు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు నగరంలో పర్యటించారు. నగరంలోని సెయింట్ జోసెఫ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్‌రెడ్డి కుమారుడు జనక్



వివాహ రిసెప్షన్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపై నూతన వధూవరులు శ్రియ--జనక్‌లను వైఎస్ జగన్ ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. దంపతులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందమయమైన వైవాహిక జీవితం గడపాలని ఆయన ఆకాంక్షించారు. వధువు శ్రియ.. రాజమండ్రి 'రుడా' మాజీ ఛైర్మన్ షర్మిలారెడ్డి, మేడపాటి అనిల్‌రెడ్డి దంపతుల కుమార్తె కావడం విశేషం. ఈ వేడుకలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్ జగన్ రాకతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

## పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేసుకోవాలి.

రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని ఆయా గ్రామాలలో సామూహిక పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేసుకోవాలని రుద్రవరం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు



కార్యాలయంలో పొదుపు సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రుద్రవరం మండలంలో పశుగ్రాస కొరత రానీయకుండా పొదుపు గ్రూపుల సహకారంతో సామూహిక పశుగ్రాస క్షేత్రాలను సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ద్వారా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలోని ఎస్ హెచ్ జి గ్రూపు ద్వారా పశుగ్రాసాన్ని సాగు చేయవలసిందిగా ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలియజేశారు మండలానికి 176 ఎకరాలలో పశుగ్రాస క్షేత్రాలకు అవకాశం లభించిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలమూరు పశువైద్యాధికారిని డాక్టర్ ఆర్ నాగ ప్రసన్న మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ఈ ఈ గా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తం

-ఘనంగా సన్మానించిన ఐఎన్‌టీయూసీ నాయకులు.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని విద్యుత్ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ)గా



సేవలందిస్తున్న పురుషోత్తం పదోన్నతి పొందారు. ఆయన అదే కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ - ఆపరేషన్స్)గా నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ నాయకులు రుద్రప్ప, జగ్గయ్య నాయక్, శంకర్, సుబ్రహ్మణ్యం తదితరులు ఆయనను కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పురుషోత్తం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిమెంట్ నగర్, గోరుమాన్ కొండ గ్రామ పంచాయతీలలో ఘనంగా గ్రామసభలు

పల్లె వెలుగు బేతంచెర్ల, సెప్టెంబర్ 03: గురువారం గ్రామసభలు ఘనంగా నిర్వహించారు.



పంచాయతీరాజ్ సంస్థల సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా బేతంచెర్ల మండలంలోని సిమెంట్ నగర్ మరియు గోరుమాన్ కొండ గ్రామ పంచాయతీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఓటర్ల గుర్తింపు, పరిశీలన, ధృవీకరణపై ఈ గ్రామసభల్లో విస్తృతంగా చర్చించారు. బేతంచెర్ల ఎంపీడీఓ మరియు ప్రత్యేక అధికారి ఎం. ఫాజుల్ రహిమాన్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలకు ప్రత్యేక అధికారి, ఎంఈఓ సోమశేఖర్ హాజరై ఓటర్ల ధృవీకరణ ప్రక్రియపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఫాజుల్ రహిమాన్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటరు జాబితాలు అత్యంత కీలకమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. ఎంపీటీఓ గారు ఆయా వర్గాల ఓటర్ల సంఖ్యను చదివి వినిపించారు. ప్రజలు తమ పేర్లను ఓటరు జాబితాలో సరిచూసుకోవాలని, తప్పులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున, పీఆర్ఓలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, సిమెంట్ నగర్, గోరుమాన్ కొండ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### వెట్టి చాకిరీ నిర్మూలన చట్టంపై అవగాహనతో

# సమర్ధవంతంగా అమలు చేయాలి.

☛వెట్టి చాకిరీ బాధితులను గుర్తించి తక్షణమే విముక్తి కల్పించాలి: ఏఎస్పీ ఖాదర్ బాషా.







పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం రూపొందించిన చట్టాలను సమర్ధవంతంగా అమలు చేస్తూ, వెట్టి చాకిరీకి గురవుతున్న వారిని గుర్తించి తక్షణమే విముక్తి కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు ఎస్పీ ఖాదర్ బాషా సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశాల మేరకు జిల్లా మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం, 1976పై అధికారులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, కార్మిక శాఖ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, డీఆర్డీఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు, వెట్టి చాకిరీ కార్మికులను గుర్తించే విధానం, బాధితులను తక్షణమే వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించే ప్రక్రియ, వారి పునరావాసం తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. అలాగే వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందిన బాధితులకు ప్రభుత్వం అమలు చేస్తున్న కేంద్ర పునరావాస పథకం ( సెంట్రల్ రిహాబిలేషన్ స్కీం) ద్వారా అందించే సహాయం, పునరావాస చర్యలు, బాధితుల సామాజిక, ఆర్థిక స్థిరత్వానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వెట్టి చాకిరీ నిర్మూలన అనేది కేవలం ఒక శాఖకు సంబంధించిన బాధ్యత కాదని, రెవెన్యూ, పోలీస్, కార్మిక, సాంఘిక సంక్షేమ, విద్యా, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయడం ద్వారా మాత్రమే ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని ఏఎస్పీ ఖాదర్ బాషా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అనుమానాస్పద పరిస్థితులను గుర్తించి, బాధితుల హక్కులను పరిరక్షిస్తూ, చట్ట ప్రకారం వేగవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా వెట్టి చాకిరీ నిర్మూలన చట్టంపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, బాధితులను గుర్తించడం నుంచి విముక్తి, పునరావాసం వరకు చేపట్టాల్సిన చర్యలపై స్పష్టత కల్పించారు.

# మీసాల మద్దిలేటిపై కేసు నమోదు

● ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఇతరుల పొలంలోకి అక్రమ ప్రవేశం ● మంది మార్బలంతో వెళ్లి పంట ధ్వంసం ● బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నాలుగు పట్టణ పోలీసులు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు కలెక్టర్ లోని శ్రీశైలం ప్రాజెక్టు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న మీసాల మద్దిలేటిపై నాలుగు పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఇతరుల పంట పొలంలోకి అక్రమంగా ప్రవేశించి ఆస్తి నష్టం కలిగించిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కల్లూరు మండల పరిధిలోని సర్వే నెంబర్ 70/ 2బీ లో ఉన్న తన ఎకరన్నర పొలంలో బోరెల్లి వెంకట్రాముడు అనే వ్యక్తి మామిడి, బత్తాయి, అల్లనేరేడు, జామ, సపోటా మొక్కలు నాటుకున్నాడు. అయితే రెవిన్యూ ఉద్యోగి అయినటువంటి మీసాల మద్దిలేటి తన మంది మార్బలంతో వెళ్లి పంటను ధ్వంసం చేయించాడు. ఇలా ఫలు దఫాలుగా పంట తొలగింపునకు పాల్పడ్డాడు. దీంతో బాధితులు వెంకట్ రాముడు నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. తన పంట పొలంలో మొక్కలను తొలగించి ఆస్తి నష్టం కలిగించాడని ఫిర్యాదు చేశాడు. తన తండ్రికి 1979లోనే డీ పట్టా ఇచ్చారని, ఆన్లైన్ కోసం తాను మీసాల మద్దిలేటిని సంప్రదించగా తన తల్లి పేరు పైన అక్రమంగా రికార్డులు పుట్టించుకొని ఆ భూమి తనదని దౌర్జన్యానికి దిగుతున్నాడని బాధితులు తెలిపారు. ఇప్పటికి నాలుగు సార్లు పంట ధ్వంసం చేయించాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాను పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదే పదే అతను తన పొలానికి అడ్డు తగులుతున్నడంతో తాను హైకోర్టులో కూడా కేసు వేసినట్టు వెల్లడించారు. ఇదొక్కటే కాదు ఇలా అతను చాలా మోసాలు పాల్పడుతున్నాడని తెలిపారు. అంతేకాకుండా తనకు రౌడీలు, గుండాలు తెలుసు అని కొంతమంది వ్యక్తులతో ఫోన్లు చేయించి బెదిరిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. మద్దిలేటి అక్రమాలు, దౌర్జన్యాలపై తాను కలెక్టర్కు కూడా ఫిర్యాదు చేశానని, కలెక్టర్ స్పందించి అతనిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**సర్కారు కొలువులో ఉండి అన్ని అక్రమాలే..**

సర్కారు కొలువులో ఉండి మద్దిలేటి చేస్తున్న అక్రమాలు అన్ని ఇన్ని కావు. నకిలీ పట్టాలు పుట్టించడం, దొంగ పాసుబుక్కులు పుట్టించడంలో ఆరితేరాడన్న ఫిర్యాదులు ఉన్నాయి. కల్లూరు తహసిల్దార్ కార్యాలయం నుంచి రికార్డులు బయటికి తెప్పించుకోవడం, వన్ బీ, మ్యాన్యువల్ అడంగల్ లో పేర్లు చేర్చడం వంటి చేతివాటం పనులు చేస్తున్నాడు అన్న విమర్శలు ఉన్నాయి. ఎంతో మందిని మోసం చేసి డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి. నకిలీ పట్టాలు ఇచ్చి మోసం చేసిన కేసులో మద్దిలేటి పై తిరుపతయ్య అనే వ్యక్తి కోర్టుకెళ్లాడు. మద్దిలేటి చేసింది మోసం అని తేల్చిన కోర్టు అతని జీవితం నుంచి నెల నెలా రూ. 10 వేలు రికవరీ పెట్టించింది. ఇప్పటికి కూడా అతని జీవితం నుంచి నెల నెలా 10,000 బాధితునికి వెళ్తోంది. అలాగే పట్టాలు చేస్తానని చెప్పి కల్లూరుకు చెందిన నర్సయ్య అనే వ్యక్తి వద్ద రూ. 15 లక్షలు తీసుకున్నాడు. తీరా మద్దిలేటి ఇచ్చింది దొంగ పట్టాలని తేలడంతో బాధితులు షాక్ కు గురయ్యారు. ఈ ఘటనలో కూడా మద్దిలేటి పై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు సంబంధించిన స్థలాలపై కూడా దొంగ పట్టాలు పుట్టించాడు. దీంతో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులందరూ కలిసి అతనిపై కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఫిర్యాదులు మద్దిలేటి పై కొల్లలుగా ఉన్నాయనే చెప్పాలి. ఇతనిపై జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఇతను మరింత పెట్రేగి పోయే అవకాశం ఉంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఒకరిపై ఒకరు..

# బాధ్యత ఎవరిది?



- విరిగిన కొమ్మతో పొంచి ఉన్న ప్రమాదం!
- అంజుమన్ వీధిలో వారం రోజులుగా ఇదే తంతు
- వారం రోజులుగా ఇదే తంతు.. ప్రమాదకరంగా వేలాడుతున్న చెట్టు కొమ్మ
- మెయిన్ సర్వీస్ వైర్లపై పడితే బాధ్యత ఎవరిది? ప్రజల ప్రాణాలకు భద్రత ఏది?

**నంద్యాల పల్లె వెలుగు సెప్టెంబర్ 3::** నంద్యాల పట్టణంలోని అంజుమన్ వీధిలో విద్యుత్ మెయిన్ సర్వీస్ వైర్లకు సమీపంలో చెట్టు కొమ్మ విరిగి వేలాడుతూ ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం ఈదురుగాలులకు పెద్దకొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడింది. ఈ సంఘటనతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఎప్పుడు ప్రమాదం ముంచుకు వస్తుందోనని ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. ఇప్పటికే కొమ్మ విరిగి ప్రమాదకర పరిస్థితిలో ఉన్నప్పటికీ, వారం రోజులుగా సంబంధిత సచివాలయ అధికారులు రోజు మార్చి రోజు అక్కడికి వచ్చి పరిశీలించి వెళ్తున్నారే తప్ప, కొమ్మను పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

**"కొమ్మను తొలగించేందుకు అధికారులు వస్తున్న సమయంలో కొంత భాగాన్ని కొడుతూ, పరిశీలిస్తూ తిరిగి వెళ్లిపోతున్నారని, కానీ ప్రమాదకరంగా వేలాడుతున్న కొమ్మను పూర్తిగా తొలగించడంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ తీగలపై పడిన కొమ్మను అధికారులు పూర్తిగా తొలగించాలని స్థానికులు పేర్కొంటున్నారు."**

ఇదిలా ఉండగా, చెట్టు ఉన్న ఇంటి యజమాని తెగిన కొమ్మను కొట్టకూడదని అధికారులకు చెబుతున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో అధికారులు కూడా కొమ్మను పూర్తిగా తొలగించకుండా వెనుదిరుగుతున్నారని వారు అంటున్నారు.





*ప్రస్తుతం ఆ ప్రాంతంలో మెయిన్ సర్వీస్ విద్యుత్ వైర్లు ఉండటంతో పాటు గాలులు బలంగా వీస్తే చెట్టు కొమ్మ పూర్తిగా విరిగి విద్యుత్ తీగలపై పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ విద్యుత్ వైర్లు తెగిపడినా, లేదా చెట్టు కొమ్మ రహదారిపై వెళ్తున్న ప్రజలపై పడినా ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరిగితే బాధ్యత ఎవరిది? నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారు? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.*

ప్రమాదం జరిగే వరకు అధికారులు ఉత్తుత్తి తనిఖీలు చేయడం కంటే, ప్రమాదకరంగా ఉన్న కొమ్మను తొలగించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ పరిపాలనలో చెట్ల ట్రిమ్మింగ్, విద్యుత్ ప్రమాదాల వంటి సమస్యలకు ఫిర్యాదు చేసే అధికారిక వ్యవస్థ కూడా ఉంది.

**"ప్రమాదం జరిగిన తర్వాత బాధ్యత ఎవరిది?"**

అనే పరిస్థితి రాకముందే అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అంజుమన్ వీధి ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్నా, మునిసిపల్ విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఈ ప్రాంత వాసులు హెచ్చరిస్తున్నారు.

## కర్నూలులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ కుమారుడి రిసెప్షన్ కు హాజరైన

- మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి
- విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్ వి జగన్మోహన్ రెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 3 పల్లె వెలుగు మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్‌రెడ్డి కుమారుడు జనక్ వివాహ రిసెప్షన్ వేడుకకు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పీపీ నాగిరెడ్డి, విజయ డైరీ మిల్క్ చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డి ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి మాజీ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి





సీనియర్ న్యాయవాది అశ్వర్థ రెడ్డి వేదికపై నూతన వధూవరులు శ్రియ--జనక్‌లను వైఎస్ జగన్ ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. దంపతులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందమయమైన వైవాహిక జీవితం గడపాలని ఆయన ఆకాంక్షించారు. వధువు శ్రియ.. రాజమండ్రి 'రుడా' మాజీ చైర్మన్ షర్మిలారెడ్డి, మేడపాటి అనిల్‌రెడ్డి దంపతుల కుమార్తె కావడం విశేషం.

**మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కలిసిన మాజీ ఎమ్మెల్యే గంగుల నాని**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కర్నూల్ నగరంలో పర్యటించారు నగరంలోని సెయింట్ జోసెఫ్ కాలేజ్ గ్రౌండ్ లో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి కుమారుడు జన వివాహ రిసెప్షన్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్ వి జగన్మోహన్ రెడ్డి పి పి నాగిరెడ్డి గంధం రాఘవరెడ్డి నరసింహారెడ్డి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు.

## ఎంఎల్ఎస్ పాయింట్‌లో జేసీ ఆకస్మిక తనిఖీ.

**స్టాక్, రికార్డుల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆదేశాలు.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన నిల్వల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎస్ పాయింట్‌లోని స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, రికార్డుల్లో నమోదైన నిల్వలను భౌతికంగా ఉన్న స్టాక్‌తో సరిచూశారు. స్టాక్ వివరాలు, రికార్డుల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, నిల్వల వివరాల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. డీఎంసీఎస్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఈ తనిఖీలో జేసీ వెంట పాల్గొన్నారు.

## రాజమండ్రి జీఎంసీలో ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలు,

**జంక్ ఫుడ్ మరియు సహజ పోషకాహారంపై, అవగాహన కార్యక్రమం**





రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 03 పల్లె వెలుగు ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ) రాజమహేంద్రవరంలో కమ్యూనిటీ మెడిసిన్, పిల్లల వైద్య విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాతీయ పోషకాహార వారోత్సవాల అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్. రాజు అధ్యక్షత వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంటికి ఆకర్షణీయంగా కనిపించే జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలని సూచించారు. పిజ్జాలు, బర్గర్ల మోజులో పడితే భవిష్యత్తులో సంపాదనంతా అనారోగ్యాలకే ఖర్చు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి వంటిల్లు ఒక ఆరోగ్యశాలగా మారాలని, కుటుంబాల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ కార్యక్రమాల అమలు సమన్వయాధికారి డాక్టర్ బి. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, పోషకాహార లోపం తీవ్ర ప్రజారోగ్య సమస్యగా మారిందన్నారు. ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషణ్ అభియాన్, పోషణ్ పఖ్వాడా సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల వైద్య విభాగం అధిపతి డాక్టర్ మోహన్ చంద్రన్ మాట్లాడుతూ, వయస్సు, శారీరక శ్రమకు తగినట్లుగా సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా మంచి దారుఢ్యం పొందవచ్చని, క్రీడల్లో రాణించేందుకు ఇది ఎంతో అవసరమని తెలిపారు. పిల్లల వైద్య నిపుణురాలు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ, జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు ప్రత్యేక పోషకాహార నియమాలు పాటించాలని సూచించారు. కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. సురేంద్ర బాబు మాట్లాడుతూ, పిల్లల్లో పోషకాహార లోపం, పెద్దల్లో ఊబకాయం పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థుల్లోనూ రక్తహీనత కనిపిస్తోందని, వ్యాధులను అరికట్టేందుకు చక్కెర, ఉప్పు, నూనెలను పరిమితంగా తీసుకోవాలని హెచ్చరించారు. సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ, ఏమి తినాలి, ఎప్పుడు, ఎలా తినాలనే దానిపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. నిల్వ ఉండే వాణిజ్య ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. పోషకాహారం ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అనే సందేశంతో ముగిసిన ఈ కార్యక్రమంలో వైద్య, పారామెడికల్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

## కార్యకర్తకు కష్టం వస్తే అండగా ఉంటాం: బుద్ధా వెంకన్న



విజయవాడ, సెప్టెంబర్ 3 కార్యకర్తలే పార్టీకి బలమని, వారి కష్టసుఖాల్లో అండగా నిలవడమే నిజమైన నాయకత్వమని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు పరుచూరి ప్రసాద్‌ను ఆయన నివాసంలో బుద్ధా వెంకన్న పరామర్శించారు. ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య చికిత్స వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ.. పార్టీ కోసం, కార్మికుల సంక్షేమం కోసం దశాబ్దాలుగా నిబద్ధతతో పనిచేస్తున్న ప్రసాద్ వంటి నాయకులు పార్టీకి విలువైన ఆస్తి అని కొనియాడారు. ఎన్నికల సమయంలోనే కాకుండా, ఆపదలో ఉన్నప్పుడు కార్యకర్త గడప తొక్కి భరోసా ఇవ్వడమే నాయకత్వ లక్షణమని స్పష్టం చేశారు. పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. ప్రసాద్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. సీనియర్ నేతను స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పిన బుద్ధా వెంకన్న చొరవపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com